# బతుకుదారి

మృగశిరకార్తె. ఎండలింకా మండిపోతూనే వున్నాయి. లంచవరు కావడం వల్ల కేంటీన్‌లో టిఫిన్ చేసి వచ్చి న్యూస్ పేపరు చేతిలోకి తీసుకున్నాను. సెక్షన్‌లో ఎవరూ లేరు-

కిటికీలోంచి వేడి గాలి తగుల్తోంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని పరిశీలిస్తున్న సంస్థలు చెప్పిందాని ప్రకారం భూఉష్ణోగ్రత ఏడాదికేడాది పెరుగుతోందిట- రాబోయే ఇరవై ఐదేళ్ళలో ఉష్ణోగ్రత సగటున ఒకటి రెండు డిగ్రీల మేరకు పెరుగుతుందని శాస్త్రసజ్ఞుల అంచనా.

ఫేక్టరీలు, మోటారు వాహనాలు వాతావరణంలోకి నిత్యం విడిచిపెడుతున్న బొగ్గుపులుసు వాయువు వల్లా; వరిపొలాలూ, పశువులూ వదిలే గ్రీన్‌హౌస్, మీథేన్ వాయువులవల్లా ఈ రకమైన పరిస్థితి ఏర్పడిందనీ, అంచేత ఆయా వాయువుల ప్రసారాన్ని తగ్గించే ఏర్పాటుచేయాలని ప్రపంచదేశాలు ప్రతిపాదిస్తున్నాయిట.

అయితే మానవాళి మనుగడకూ, పురోగమనానికి దోహదపడే ఈ పారిశ్రామికీకరణ, పాడిపంటలూ తగ్గించుకోడం సాధ్యమా?

పేపరు మూసి ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాను.

అంతలోనే గుమ్మందాటి లోపలికి వచ్చి నావైపుగా వస్తున్న వ్యక్తి వంకకు చూపులు మరల్చాను. ఎవరో విధవరాలు. డెబ్బయ్ ఏళ్ళు వుంటాయేమో! సరాసరి నా బల్ల దగ్గరకే వచ్చింది.

"నమస్కారం బాబూ. నా పేరు భూలోకండీ" అంది. రాలిపోయే దశలోని పండుటాకులా వుంది. ఏంకావాలన్నట్టు చూశానామెవంక.

"కండిపిల్లి సింహాచలమనీ నా కొడుకు బాబూ. ఈ కంపెనీలోనే పన్జేసేవోడు. ఆరేళ్ళ క్రితం పోయేడు బాబూ"

ఆమె గొంతులో కాస్త వణకు. కళ్ళలో సన్నటి నీటిపొర. సాధారణంగా అటువంటివారు నా దగ్గరకెందుకొస్తారో నాకు తెల్సు.

"పెన్షన్ రావటంలేదా?" అడిగాను.

"వస్తున్నాది బాబూ... కానీ " అంటూ ఆగింది.

"ఇంకేమిటి? ఎవరికన్నా ఉద్యోగమా?"

కాదన్నట్టు తలూపి చెప్పింది.

"నా కొడుకు తాలూక పించను ఇపుడు నా కోడలు అందుకుంటంది బాబూ- అయితే మనవలిద్దరూ నాకాడే వున్నారు. ముసిల్దాన్ని. అళ్ల ఆలనా, పాలనా సదువూ నానే చూసుకుంటన్నాను. అంచేత - ఆ డబ్బులు నాకే ఇప్పిస్తే మీ మేలు మర్చిపోను" అంది.

విషయం కాస్త అర్ధమైంది.

"నీ కోడలూ, నువ్వూ జగడమాడుకున్నారా" అడిగాను. ఇటువంటి కేసులు మాకు మామూలే.

కాస్త తడబడి, "లేదులే బాబూ" అంది.

"మరి? మీ ఇద్దరూ ఒక దగ్గర వుండటం లేదా?"

ఉండటం లేదన్నట్టు తల అడ్డంగా ఊపి-

"మావోడికి పెళ్ళయినకాడ్నించీ ఆడూ కోడలూ వేరేగానే వుంటన్నారు. మనవలు మాత్తరం తండ్రి పోయేక చేరికై నాకాడే వుంటన్నారు" అంది.

"అదిసరే. పెన్షన్ ఎవరికిపడితే వారికివ్వరు. నీ కొడుకు ఎవరిపేర్న నామినేషన్ రాస్తే వారికి అతని తదనంతరం ఇవ్వడం జరుగుతుంది. అతను తన భార్య పేర్న రాస్తే నీకెలా వస్తుంది?" అన్నాను.

"నేనాడి తల్లినిగదా బాబూ" అంది అమాయకంగానే.

"నిజమే కావొచ్చు. కానీ రూల్సు ఒప్పుకోవు. అదీగాక చనిపోయాడుగదాని అతని ఇష్టానికి వ్యతిరేకంగా పోతామా చెప్పు" అన్నాను అనునయంగా.

కొడుకు గుర్తొచ్చాడు గావును కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"మరి... నీకెవ్వరూ లేరా?"

లేరన్నట్లు తలూపింది.

ముసలి తల్లి అల్లమై పెళ్ళామే బెల్లమవడంలో ఆశ్చర్యం లేదు. అయినా ఇందులో ఈమె పాత్ర ఎంతుందో తెలియాలిగా.

"అటువంటప్పుడు కొడుకు పంచనే వుండాల్సింది. అప్పుడు వేరై ఇప్పుడు కొడుకు సొమ్ము కోసం బాధపడితే ఎలా?" అన్నాను కాస్త కటువుగానే- వృత్తి నేర్పించిన మాటలవి.

"పెళ్ళయిన తర్వాత ఆడే వేరువడిపోయాడు బాబూ. ముసలోడు కొన్నాళ్ళు ఆ బెంగతోనే చిక్కి సగమయ్యాడు. పోనీ ఉన్నూళ్ళోనే గదా ఎక్కడుంటేనేం అని సరిపెట్టుకున్నాం. ముసలోడు పోయేక కూడ అద్దె డబ్బులెందుకు పోస్తావూ నా కాడికొచ్చీరా నాయనా అన్నాను. ఇంటేనా? ఇలగైపోతాదని కల్లో కూడ అనుకోలేదు" మళ్ళీ కళ్ళొత్తుకుంది.

"ఏం చేస్తాం ఇటువంటివి కొంతమందికి తప్పవ్" అన్నాను ఓదార్పుగా.

ఓ పది నిముషాలు మౌనంగా అక్కడే నిల్చుంది. "మనవలిద్దరూ నీ దగ్గరే వుంటున్నారన్నావుగా. పోనీ కోడల్ని కూడ నీ దగ్గరే వుండమనరాదూ? పై మనిషా ఏమన్నానా? ఈ పెద్ద వయసులో ఆమె నీ దగ్గరుండడం మంచిది కదా" అన్నాను.

ఏదో చెప్పబోయి, సంశయించి ఓ క్షణం ఆగి అంది- " నేనూ అలగే అనుకున్నా బాబూ. కానీ పాపిష్టి వయసూ, పాపిష్టి డబ్బూ దాన్నలా అడ్డదోవ పట్టించేయి"

కాస్త అర్ధమైనా మౌనంగానే ఊరుకున్నాను.

"మొదట్లో నానూ నమ్మలేదు బాబూ. ఒంటరి ఆడది మగతోడులేకుండా వుంటే ఎన్ని పుకార్లేనా వస్తాయి. అలగే అనుకున్నాను- కానీ మొన్న నా కళ్ళతో చూశాను బాబూ నిప్పు లేందే పొగరాదుకదా అన్పించింది. పిల్లలిప్పుడు దానికెలాగూ అడ్డే బాబూ. ఆళ్ళ బరువు బాధ్యత ముసిల్దాన్ని నాకప్పగించేసి ఆ డబ్బుతో ఆడితో కులకాలనుకుంటంది గావును. అందుకే మీకాడికొచ్చినా బాబూ" అంది.

ఈ విషయంలో న్యాయం ఈమె పక్షాన వున్నా రూలు ప్రకారం పెన్షన్ మాత్రం ఈమెకివ్వడం జరగదు- ఆ సంగతి విడమరచి చెప్పినా వినేట్టు లేదు.

"సరే. ఆ విషయం కాగితం రాయించి పెట్టు. పై అధికారికి పంపిస్తాను ఆయన ఆర్డరిస్తే నీకే ఇచ్చేస్తాం" అన్నాను.

ఈ మాటు కాస్త సంతృప్తి కన్పించిందామె ముఖంలో.

"తెలుగున రాయెచ్చా బాబూ" అంది వెళ్ళబోతూ.

"ఓ" అంటూ నా పనిలో నేను మునిగిపోయాను.

సరిగ్గా మూడు రోజుల తర్వాత వచ్చింది కాగితం పట్టుకుని ఎవరిచేత రాయించిందో గాని నిందలన్నీ కోడలిపైనే వున్నాయి. క్రింద పేరు రాయించి వేలి ముద్ర వేసింది.

"నీ పేరూ ఎడ్రసూ ఇందులో వుందిగా. పైనించి ఆర్డరొస్తే నీకు వెంటనే తెలియపరుస్తాం. నువ్వు రానక్కరలేదు" అంటూ కాగితాన్ని అందుకొని సంబంధిత గుమస్తాకి పంపించేను.

ఆ మూడోనాడు ఫైలు నా టేబిల్ మీదికొస్తే చూశాను. ముసలామె కొడుకు అతని భార్యపేరునే గాని తల్లిపేర్న ఎక్కడా నామినేషన్ ఇచ్చినట్టులేదందులో. అటువంటప్పుడు భార్యకు కాక ఈమెకు పెన్షన్ ఇవ్వడం జరగదు. అయితే రూల్లో ఒకటుంది. పెన్షన్ పుచ్చుకుంటున్న విధవరాలైన ఉద్యోగి భార్య పునర్వివాహం గనుక చేసుకుంటే ఆమె పెన్షన్ పొందడానికి అర్హురాలు కాదు.

కానీ ఆ విషయం నిర్ధారణ కావాలి. అందుకోసం ఆమె కోడల్ని కూడ కొన్ని విషయాలు అడిగి తెల్సుకోవాల్సి వుంది. ముసలమ్మ కోడలు కనకరత్నం పెన్షన్ తీసుకోడానికొచ్చినపుడు నా దగ్గరకు పంపమని గుమస్తాకి చెప్పాను. అయితే ఈ విషయం తెల్సి ఆమె భయపడిందో లేక మరేమైనా జరిగిందో రెండు నెలలు వరుసగా ఆమె పెన్షన్ తీసుకోడానికే రాలేదు.

◆ ❖ ◆

సాయంకాలం ముందు వాకిట్లో కూర్చుని సాహిత్యపత్రికలోని వ్యాసమేదో చదువుతున్నాను.

కిర్రుమని గేటు తీసిన చప్పుడైతే తలెత్తి అటువంక చూశాను.

ముప్ఫయ్ అయిదేళ్ళుంటాయి ఆమెకు. అంతకు ముందు చూసిన గుర్తులేదు. సందేహిస్తూనే లోపలికి నెమ్మదిగా నడచి వచ్చింది.

"ఎవరూ?" అన్నాను ఆమె వంక చూస్తూనే.

"బాస్కరం బాబంటే తమరేనా బాబూ" అడిగింది.

అవునన్నట్లు తలూపేను.

"దండాలు బాబూ – నా పేరు కనకరత్నం. తమతో నాలుగు మాటలు మాట్లాడాలనీ..." అంది.

తేరిపార చూశానామెవంక. గుండ్రని ముఖమూ, పొడవుకు తగ్గ లావూ, చామనఛాయలో స్త్రీత్వం ఉట్టిపడేట్లు వుంది.

“ఏం పనీ?” అడిగేను.

“మా అత్త నామీద మీకు ఫిర్యాదు చేసిందటగా బాబూ పించను తనకు ఇప్పించమనీ..” అంది నెమ్మదిగా.

ఆమె ఎవరో నాకర్థమైంది.

విషయం వివరంగా చెప్పాలని కాబోలు కాస్త దగ్గరగా జరిగి, నా కుర్చీకి కాస్త ఎడంగా వున్న డాబామెట్ల గోడనానుకుని నిల్చుంది.

“ఆఫీసు విషయాలైతే అక్కడే మాట్లాడాలి- ఇలా ఇంటికి రావడం నాకిష్టం వుండదు” అన్నాను కాస్త కటువుగానే.

“నిజమే బాబూ. రాకూడదు. కానీ మీతో నాలుగుముక్కలు సావకాశంగ చెప్పడానికి మరోదారి కన్పించలేదు” అంది తలొంచుకుని.

నిజానికి నేనే ఆమెతో మాట్లాడాలని చూస్తున్నాను ఈ రెండు నెలలుగా. ఈమె నుండి వివరాలు తెల్సుకుంటేనే గాని ముసలమ్మ ఇచ్చిన కాగితంమీద చర్య తీసుకోడానికి వీలుండదు.

“ఇంతకీ మీ అత్త చెప్పింది నిజమేనా” అడిగాను. అంత సూటిగా నానుండి ప్రశ్న వస్తుందని ఆమె అనుకుని వుండదు-

మౌనాన్నే ఆశ్రయించింది.

“ప్రభుత్వాన్ని కొంతకాలం మోసం చెయ్యొచ్చునేమో... ఎల్లకాలం చేయడం కష్టం. నిజం ఎప్పటికైనా బయటపడుతుంది. శిక్షకూడా పడొచ్చు” అన్నాను భయపెట్టే ధోరణిలో.

ఆ మాటతో ఆమె తలెత్తి నావంక చూసింది.

ఆ కళ్ళలో నీళ్ళు!

“జీవితంలో మోసపోయిందాన్నేగాని మోసం చేసేదాన్ని కాదు బాబూ నేను” అని, తన జీవిత గమనాన్ని నాలుగు ముక్కల్లో చెప్పింది.

వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టిన తను పుడుతూనే తల్లిని దూరం చేసుకుందట- ఇద్దరన్నలు, ముగ్గురక్కలు- అప్పుల్లో మునిగివున్న తండ్రి తన పెళ్ళితో నిండా అప్పుల్లో కూరుకుపోయడట.

నాలుగేళ్ళు కాపరం చేసి ఇద్దరు పిల్లలకు తల్లిని చేసిన భర్త అకస్మాత్తుగా పోవడం... తండ్రి పంచన జేరకుండా పెన్షన్ మీద ఆధారపడ్డం-

ఇవి చెప్పి, "పెబుత్వం నాకీ పించను ఇప్పించకపోతే నా బతుకేటై పోయేదో ఆలోచించండి బాబూ. అటువంటి పెబుత్వాన్ని ఎందుకు మోసం చేత్తానూ" అంది.

"మరి... మీ అత్త చెప్పిందంతా అబద్ధమేనంటావా? ఆమెకా వయసులో అబద్ధం చెప్పే అవసరమేం వుంటుంది" అన్నాను.

ఒక్కక్షణం ఆమె మౌనంగా తలొంచుకుంది. అది అర్ధాంగీకార సూచన అవునో కాదో గాని, నాకామెపై ఒకింత అధికారాన్నీ చొరవనూ సంపాదించి పెట్టిందదే-

"వయసులో వున్నదానివీ, ఒంటరిదానివీ- ఒప్పుకుంటాను. కొన్ని కులాల్లో మారు మనువు కూడా తప్పుకాకపోవచ్చు కానీ.. నీ భర్త చనిపోయినా నీ జరుగుబాటు చూస్తూ నిన్ను ఆదుకున్నట్టే లెక్క. మరి- అటువంటివాడి డబ్బు తింటూ ఇలా..."

ఆమె మౌనంగానే కన్నీళ్లు తుడుచుకుంది.

'నాకెవ్వరిచ్చారీ అధికారం' అన్పించినా, ప్రభుత్వోద్యోగిగా, విధినిర్వహణలో ఒక పాత్రగా ఇలా ప్రవర్తించక తప్పదేమో అని కూడా అన్పించింది.

"ఇంతకీ ఎవరతను? నిజంగా ఏమీ కాకపోతే నిర్భయంగా చెప్పు. నీకేం అన్యాయం జరగదు-" అన్నాను.

ఆమె నెమ్మదిగా నోరు విప్పింది.

ఉన్న ఊళ్ళో జీవనోపాధిలేక పొట్ట చేత్తో పట్టుకుని పనికోసం వచ్చిన అతనిని ఓ క్లిష్ట పరిస్థితిలో ఆదుకుని పట్టెడన్నం పెట్టిందట-

-అదీ ఆమె కతనితో పరిచయం.

"మనషులిట్లా ఒక్కోక్కప్పుడు తెగిన గాలిపటాల్లా ఎందుకైపోతారో అన్పిస్తూంటుంది బాబూ- దీనికంతకూ కారణం డబ్బేగా! అతనికి వంట్లో పనిచేయడానికి శక్తివుంది. బుర్రలో తెలివుంది- కానీ అవకాశాలే లేవు! అతన్ని చూసి జాలిపడి రెండ్రోజులు తిండిపెట్టాను. రోజంతా పనికోసం తిరిగి రాత్రి నేను పెట్టిన ఆ నాలుగు మెతుకులు తిని, మా అరుగుమీదే పడుకున్నాడు- నేనంతకు మించి అతనికి చేసింది లేదు- లోకులు కాకులు బాబూ... నీళ్ళలో కూడా నిప్పుపుట్టించేయగల్రు. ఒంటరి ఆడదాన్నైనంత మాత్రాన సాటి మనిషిని ఆదుకోకూడదా బాబూ? అంతే బాబూ- అంతకుమించేంలేదు- మీరు మాత్రం ఆ పించను డబ్బులు నాకు కాకుండా చేయకండి బాబూ- కూడూగుడ్డా లేకుండా అన్యాయమై పోతాను" అంది.

అంతే అన్నా; అంతకుమించేం లేదన్నా ఏదో వుండి వుంటుందనే అన్పించింది. లోకంలో ఎవరూ లేనివాడతడు- మగతోడు లేనిదీమె. ఆడదైవుండీ అంతకంటే ఏమి చెప్పగలదు? ఒకవేళ కూడు కోసం అతనూ; తోడు కోసం ఈమె ఒక తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకున్నా అదెన్నాళ్లుంటుంది?

"మరి మీ అత్తనుకూడా నీ దగ్గరే వుంచుకుంటే సమస్య పరిష్కారమయ్యేదిగా! అన్నాను.

"ఆమె నా దగ్గరకు రాదు బాబూ- ఆమెకు ఇల్లుంది. దానిమీద అద్దె వస్తుంది. ఆమె బతుక్కది చాలు. పిల్లలు ఇప్పుడు అక్కడే వున్నా రేపామె కన్నుమూస్తే ఆళ్ళ భారం నాది కాదా బాబూ- ఈ నాలుగు రోజుల భాగ్యానికి నా నోటికాడ కూడు పడగొట్టాలనుకోడం న్యాయమా చెప్పండి" అంది.

ఎట్నించి ఏం మాట్లిడినా చివరికామె చెప్తున్నదొకటే.

ఆమె తెలివితేటలకు ఆశ్చర్యమనిపించింది.

మర్నాడు ఆఫీసులో కేసంతా క్షుణ్ణంగా చదివి, అందుకు సంబంధించిన రూల్సన్నీ ఒకటికి రెండుమార్లు తరచితరచి చూశాను.

ఇటువంటి కేసులో... చనిపోయిన కార్మికుని తాలూకు భార్య పెళ్ళిచేసుకున్నా లేదా ఎవరితోనైనా సంబంధం పెట్టుకుని వ్రాతపూర్వకమైన ఒప్పందం కుదుర్చుకున్నా పెన్షన్ ఇవ్వకూడదరు. ఆ రెండూ కాని పక్షంలో భర్త పెన్షన్ ఆమెకు జీవితాంతం వస్తుంది.

పెన్షన్ ఇవ్వకపోయినా ముసలమ్మ బతుక్కేం భయంలేదు- కాని ఇది నిజంగా పుకారే అయితే ఈమెకు బతుకే వుండదు!

గుమస్తా పెట్టిన నోట్‌మీద నా అభిప్రాయాన్ని కూడ జతచేసి, అక్కడితో ఆ మాటే మర్చిపోయాను.

మరో మూడు నెలల తర్వాత ఓ సాయంకాలం కనకరత్నం మా ఇంటికొచ్చింది. ఈమారామెలో చాలా మార్పే కన్పించింది.

"అతనికి ఎరువుల ఫేక్టరీలో పనయ్యింది బాబూ- మీబోటి మారాజులు దయతలచి సాయంచేసేరు" అని ఒక క్షణం ఆగి-

"తమరన్నట్టు మారుమనువు మాకు తప్పుకాదు బాబూ- నింద ఎటూ వచ్చింది- మనుసులు కలిశాక మగతోడు లేకుండా నేను మాత్రం ఎందుకు బతకాల? అందుకే గుళ్లో పెళ్లి చేసుకున్నాం. నా పిల్లలు కూడా ఇపుడే నా దగ్గరే వుంటున్నారు. ప్రభుత్వాన్ని మోసం చేయకూడదుగా. అందుకే తమతో చెప్పిపోదామని వచ్చాను" అంది.

ఆమె నిజాయితీకి ఆనందమనిపించింది.

◆ ❖ ◆